# నిర్ణయం

– ముద్దా విజయలక్ష్మి

అంత వరకూ నిశ్శబ్దంగా వున్న ఆఫీస్ పోస్ట్‌మేన్ రాకతో ఒక్కసారిగా చైతన్యమంతమైంది. అతడు ఆ ఆఫీసుకి రావడమూ కొత్త కాదు. అక్కడి ఉద్యోగులకి ఉత్తరాలివ్వడమూ కొత్త కాదు. అయితే పోస్ట్‌మేన్ సరాసరి అరుణ సీటు టేబుల్ వద్దకు వచ్చి ఒక ఉత్తరాన్ని ఆమె చేతికివ్వడం పెద్ద విశేషం. అంతకుమించి సంచలనం.

అరుణ కూడా ఆశ్చర్యపోతూనే ఉత్తరాన్ని అందుకుంది. ఆసక్తిగా తన వంక చూస్తున్న అందరికేసి ఓసారి చూసి, ఉత్తరం విప్పి చదవసాగింది. అలా చదువుతున్నప్పుడు ఆమె ముఖంలో మారే రంగుల్ని గమనించగలిగారు కాని ఏ భావాన్నీ పసిగట్టలేకపోయారు తోటి ఉద్యోగులు.

ఉత్తరాన్ని ఎంతకీ మడవకపోవడంతో ఆమె ఆ ఉత్తరాన్ని మళ్ళీ మళ్ళీ చదువుతోందన్న నిర్ణయానికి వచ్చేశారు. ఆమె చదవడం పూర్తి చేసి దాన్ని మడిచి బాగ్‌లో పెట్టేవరకూ ఓపిగ్గా ఎదురుచూశారు.

అందరూ అలా ఆశ్చర్యపోవడానికి కారణం అక్కడ చేరిన రెండేళ్ళ కాలంలోనూ అరుణకి అదే మొదటి వుత్తరం కావడం. ఎవ్వరికీ ఆమె ఉత్తరం రాయడం కాని, ఉత్తరం కోసం ఎదురు చూడడం కాని లేదు. అలాంటిది ఈ రోజు ఎక్కడినుంచో వచ్చిన ఒక ఉత్తరం పోస్ట్‌మేన్ సరాసరి అరుణకే తెచ్చివ్వడం అందరి ముఖాల్లో ఆశ్చర్యం నింపడంతోపాటు, మనసుల్లో ఆలోచనలు రేకెత్తించింది. అది ఎక్కడి నుంచి వచ్చి వుంటుంది? ఎవరు రాశారు? అందులో ఏముంది? అన్న ప్రశ్నలు వారి మెదళ్ళను తొలుస్తున్నాయి.

'ఉత్తరం మీకేనా?' అడిగింది సహోద్యాయిని గీత. ఎవరి ఉత్తరమో పొరపాటున తెచ్చి అరుణకు ఇచ్చివుంటాడన్న అనుమానంతో. తనకేనన్నట్టుగా తల వూపింది అరుణ. గీతకి మరింత ఆసక్తి పెరిగింది. వివరంగా తెలుసుకోవాలన్పించినా అది సభ్యత కాదని వూరుకుంది గీత. అది గమనించి వూపిరి పీల్చింది అరుణ.

ఆ ఆఫీసులో స్టెనోగ్రాఫర్‌గా పనిచేస్తున్న అరుణ గురించి కొన్ని పుకార్లు ప్రచారంలో వున్నాయి. వాటికి మూలమేంటో, అవి ఎంతవరకు నిజమో ఎవరికీ కచ్చితంగా తెలియదు.

ఒకటి అరుణ కాలేజీలో చదూకునే రోజుల్లో ఎవర్నో ప్రేమించిందని, అతను పెళ్ళికి ఒప్పుకోకపోవడంతో భగ్న ప్రేమికురాలైందనీ..'

రెండు అంతకు ముందు పనిచేసిన ఆఫీసులో ఓ క్లర్క్ ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించి అత్యాచారం చేయబోవడంతో ఆ కొలువుకు స్వస్తి చెప్పి ఇక్కడికి వచ్చి చేరిందనీను.

మూడు అవేవీ కావు. ఆమెకి చిన్నప్పుడే పెళ్ళయిందనీ, భర్త చనిపోయాడని, అరుణ ఇప్పుడు వితంతువనీ.

అదంతా పూర్వాశ్రమం. ప్రస్తుతం షికారు చేస్తున్న పుకారు ఏమిటంటే ఆమె మేనేజర్ ప్రసాద్‌తో ప్రేమాయణం సాగిస్తోందనీను.

అసలు ఇవేవి నిజం కాదనీ, అరుణ వెర్రిబాగులదనీ, ఏదో ఆలోచిస్తూ దేని కోసమో ఎదురు చూస్తున్నట్టుగా వుండే అరుణ అమాయకురాలనీ నమ్మేవాళ్ళు కూడా కొందరు లేకపోలేదు ఆ ఆఫీసులో. అలాంటి అరుణకు ఎక్కడినుంచో ఉత్తరం వచ్చిందంటే వారందరిలో ఆసక్తి కలగడంలో ఆశ్చర్యం లేదు. కారణం అరుణ అప్సరస కాదు. అలా అని అనాకారీ కాదు. చూడ్డానికి బాగుంటుంది. కాకపోతే అలంకరణ పట్ల బొత్తిగా శ్రద్ధ వున్నట్టు తోచదు. చీర కట్టుకోవాలి కాబట్టి చీర కట్టుకున్నట్టు, తల దువ్వుకోవాలి కాబట్టి తల దువ్వుకున్నట్టు, బొట్టు పెట్టుకోవాలి కాబట్టి బొట్టు పెట్టుకున్నట్టూ కనపడుతుంది. ఆఫీసులో అందరి ఆడవాళ్ళలాగా అలంకరించుకోదు. చాలా మామూలుగా, సాదా సీదాగా వుంటుంది. చక్కగా అలంకరించుకుంటే అరుణ మరింత అందంగా కనపడుతుందన్న మాట అబద్ధం కాదు. అంత సింపుల్‌గా వున్నా మేనేజర్ ప్రసాద్‌కి ఆమె అంటే ఎందుకు ఇష్టమో ఎవరికీ అంతుబట్టని ప్రశ్న. మిగతా ఆడవాళ్ళతో కంటే అరుణతోనే చనువుగా వుంటాడాయన. అదే ఆఫీసులో ఆమె గురించి కట్టు కథలకు ఆధారమైంది.

అరుణ ఆఫీసులో ఎవరితోనూ కలవదు. ఏకాంతంగా వుండడం ఆమెకిష్టం. తనపని తాను చేసుకుపోతుంది తప్ప ఎవ్వరితోనూ బాతాఖానీ వేయదు. సంభాషణల్లో జోక్యం చేసుకోదు. లంచ్ అవర్లో కూడా ఒంటరిగానే కూర్చుని పని ముగించుకుని ఆ తర్వాత ఏ వారపత్రికో తిరగేస్తుంది ఎవరితోనూ మాటలు కలపదు. మళ్ళీ ఆఫీసు టైం అయిపోగానే ఠంచనుగా వెళ్ళిపోతుంది. ఆ ఆఫీసులో పంక్చువల్‌గా టైం పాటించేది అరుణ ఒక్కతే. చాటుమాటుగా మాట్లాడుకోవడం తప్పించి ఎవ్వరూ ఆమె గురించి మాట్లాడుకోవడానికి సాహసించరు.

అటువంటి అరుణకి ఉత్తరం రావడం ఆఫీసులో ఆరోజు పెద్ద చర్చనీయాంశంగా మారింది. అసలు వారందరికంటే ఉత్తరం అందుకున్న అరుణే ఎక్కువ ఆశ్చర్యపోయింది.

మదన్ దగ్గరినుంచి ఉత్తరం వస్తుందని గాని, అసలతను అలా రాస్తాడని కాని ఆమె ఊహించలేదు. ఇంటికి వచ్చిన తర్వాత ఆ ఉత్తరాన్ని పదే పదే చదువుకుంది.

* ప్రియమైన అరుణకి: మన పరిచయాన్ని పురస్కరించుకుని నిన్నిలా పిలవగలిగే అర్హత నాకుందనే భావిస్తాను. చాలా కాలం తర్వాత ఇవే మన మధ్య మొదటి మాటలు కదూ! ఇదే మొదటి ఉత్తరం కూడా! అసలు సంగతి ఈ ఉత్తరం నీకు బహుశః గురువారం అందవచ్చు. శనివారం నాటికి నేను అక్కడికి వస్తున్నాను. నాకు స్వాగతం లభిస్తుందని ఆశించవచ్చా? మిగతా విషయాలు నీ సమక్షంలో మాట్లాడతాను.

మదన్ మోహన్.

ఉత్తరం క్లుప్తంగా వుంది. శనివారం అంటే ఎల్లుండి. అంటే ఉత్తరానికీ, మనిషి రాకకీ మధ్య

ఒకరోజు గడువెందుకో? ఆ ఉత్తరాన్ని అలాగే చేత్తో పట్టుకుని ఆలోచనల్లోకి జారిపోయింది అరుణ.

** ** ** ** తమ పెళ్ళికి ఉభయ ఇరువురి కుటుంబాలూ సుముఖంగా లేవని తెలుసుకున్నప్పుడు తను అంది 'ఇప్పుడేం చేద్దాం" అని.

'అదే ఆలోచిస్తున్నాను' అన్నాడు మదన్.

'వాళ్ళెలాగూ ఒప్పుకోరని తెలిసిపోయింది, పోనీ ఒకపని చేద్దాం!"

"ఏమిటి? అడిగాడు.

"మనం ఇక్కడి నుంచి ఎక్కకడికైనా వెళ్ళి పెళ్ళి చేసుకుందాం" ధైర్యం చేసి అంది తను.

ఉలిక్కిపడ్డాడు మదన్. 'ఏమిటి నువ్వనేది? ఎక్కడికి వెడతాం?' 'ఎక్కడికైనా సరే! మనిద్దరం కలసి జీవించగలిగే చోటుకి' మదన్ గుండెల మీద వాలిపోయి అతనికి దూరం కావడం ఏమాత్రం ఇష్టం లేనట్టుగా అంది అరుణ.

'నువ్వు సూచించే పద్ధతిని ఏమంటారో తెలుసా?'

'దానికి నువ్వేపేరైనా పెట్టు. మనవాళ్ళు మన పెళ్ళి చేయనప్పుడు మనమే చేసుకోవడంలో తప్పేముంది?

'ఉంది! చాలా వుంది. సారీ! నువ్వు చెప్పినట్టు నేను చేయలేను. పిరికి వాళ్ళలా పారిపోయి అందరికీ దూరంగా దొంగలా తప్పు చేసిన వాడిలా నేను బ్రతకలేను. మన పెళ్ళి అందరూ ఒప్పుకుంటేనే జరుగుతుంది".

'లేని పక్షంలో జరగదంటావ్? ఆడదాన్ని నాకున్న ధైర్యం కూడా నీకు లేకపోయింది" కోపంగా అంది తను.

"అరుణా నీకు చెప్పినా అర్థం కాదు. నన్ను క్షమించు! నేను అనుకున్నది సాధించగలిగితే ఏదో ఒకనాడు నీకోసం నీ దగ్గరికి వస్తాను." అని గబగబా వెళ్ళిపోయాడు మదన్.

అంతే ఆర్వాత మళ్ళీ కనపడలేదతను.

మదన్‌కి తెలుసు తను అతని కోసం నిరీక్షిస్తుందని. ఆలస్యమైనా ఇప్పుడు తాను అమృతాన్ని అందుకోబోతోంది. అరుణ కళ్ళల్లోకి కొత్త కాంతులు వెలుగుతున్నాయి. ఎదురు చూసే ఆ కళ్ళల్లో కలలేవో కదలాడుతున్నాయి.

** ** ** ** శనివారం రానే వచ్చింది. మదన్ ఇప్పుడెలా వుంటాడో. ఈ రెండున్నర సంవత్సరాల్లో అతనిలో ఏ మార్పులు వచ్చాయో! అతను ఎలా వుంటాడో చూడాలని తెగ ఉబలాటం. ఒకటే ఆరాటం. మదన్‌కోసమే ఎదురు చూస్తోంది. తను కన్పించగానే మదన్ ఏమంటాడు. రిసీవ్ చేసుకునేది తనే అయినా మదన్ తనను ఎలా రిసీవ్ చేసుకుంటాడో! ఉత్తరాన్ని బట్టి చూస్తే అతని ప్రేమలో నిజాయితీని



శంకించలేకపోయింది.

కళ్ళన్నీ వాకిలి వైపే వున్నాయి. ఎప్పుడొస్తాడా! అని ఎలా వుంటాడో చూడాలని! ఎదురు చూడ్డంలోనూ హాయి వుంటుందంటారు కాని నిజం చెప్పాలంటే ఎదురుచూడ్డంలో ఉత్కంఠ కూడా వుంటుంది. టక్ టక్‌న బూట్ల శబ్దం వినిపించింది. వచ్చేశాడు మదన్. తన మదన్ వచ్చేశాడు.

"బాగున్నావా అరుణా?" తనే ముందు పలకరించాడు. తన హృదయం మూగబోయింది. నోట మాట రావడం లేదు. ఆవహించిన ఆనందం ఆనందబాష్పాలు తెప్పించింది.

మదన్‌లో చాలా మార్పు వచ్చింది. మనిషి డిగ్నిఫైడ్‌గా కన్పిస్తున్నాడు. అప్పటికంటే కొద్దిగా ఒళ్ళు చేశాడు. రంగు వచ్చాడు. పంక్ హెయిర్ స్టయిల్‌లో ఆకర్షణీయంగా అపిస్తున్నాడు. కళ్ళల్లో మాత్రం అదే మెరుపు.

"ఏమిటలా చూస్తున్నావు తినేసేలా? అడిగాడు ఎప్పటిలానే చిలిపిగా చూస్తూ

'అబ్బే ఏంలేదు" అరుణ తడబడింది.

"నువ్వు పూర్తిగా మారిపోయావు!" అంది.

"నువ్వుకూడా" అన్నాడతను.

"నేనా?" ఆశ్చర్యపోయింది

"అవును చాలా చిక్కిపోయావు".

"నీ కోసమే!"

"నల్లబడిపోయావు".

"చిక్కినప్పుడు నల్లబడడం సహజమే!".

"జబ్బుపడిన మనిషిలా తయారయ్యావు".

"అవును! ప్రేమ జబ్బు పట్టుకుంది".

"అన్నం తినడంలేదా?"

"ఊహూ! నీ పేరునే జపిస్తూ గాలి భోంచేస్తున్నాను".

ఈ జవాబులివ్వాలనుకున్న మాటలు పెగలట్లేదు తనకు. పెదవులు దాటనంటున్నాయి మాటలు.

"ఏమిటరుణా! మాట్లాడవు! నీ ఆలోచనలిక్కడ లేవట్టుందే! ఆలోచించే ఇలా అయ్యుంటావు!"

'అవును! నీగురించే ఆలోచిస్తున్నాను. నీకోసమే, నువ్వు వస్తావని ఎదురు చూస్తున్నాను" అందామనుకుంది కాని అతను అడిగే వాటికి దేనికీ బదులు చెప్పలేకపోతోంది. మనసులోనే సమాధానాలు చెప్పకుంటూ మౌనమే తన భాషగా మారింది.

"ఊ! ఇంకా ఇలాగే వున్నావన్నమాట! ఇంకా నీవు ఎంతో మారిపోయి వుంటావనుకున్నాను. అరుణని పరీక్షగా చూస్తూ అన్నాడతను.

'మారానని నువ్వే అంటున్నావ్!" ఎలాగో మాటలు రాలాయి అరుణ నోటి నుంచి.

"నేననేది ఈ రకం మార్పు కాదు".

"మరి? తలెత్తి అతని వంక చూసింది.

మదన్ మాట్లాడలేదు. కాసేపయిన తరువాత అన్నాడు.

"చాలా కాలానికి కలుసుకొన్నాం. నా గురించి ఏమీ తెలుసుకోవాలని లేదా?"


"లేదు. నీగురించి నాకు అంతా తెలుసునను కుంటున్నాను" అంది అరుణ.

"ఊ! దూరంగా వున్నా నా గురించి తెలుసుకుంటూ నన్ను గుర్తుచేసుకుంటూనే వున్నావన్న మాట?" నవ్వుతూ అన్నాడు.

"పిచ్చిప్రశ్న. గుర్తు చేసుకోవడం ఏమిటి? నిన్ను ఆరాధిస్తున్నాను" అని అనాలనుకొని అదీ మనసులోనే అనుకుంది.

అరుణ మౌనంగా వుండడం చూసి నా భార్య ఎలా వుంటుందని అడగవేం?" అన్నాడు మదన్.

అదిరిపడి తలెత్తి చూసింది. మదన్‌కి పెళ్ళయిందా? లేక తనని తమాషా చేస్తున్నాడా? అయితే మరి ఇక్కడికెందుకొచ్చినట్టు? తనని ఫూల్‌ని చేయడానికా? తనింకా బతికి వుందో లేదో చూసి పోవాలనా? అరుణ మనసులో తుపాను చెలరేగింది. వేటగాడి బాణం తగిలినట్టుగా విలవిలలాడిపోయింది. మాటలు రానట్టు మౌనంగా పిచ్చి చూపులు చూస్తూ నించుంది. కొద్ది క్షణాల్లో కొన్ని వేల ఆలోచనలు బుర్రలో గిర్రున తిరిగాయి. చాలా సేపటి తర్వాత తేరుకుని అంది.




"అవును. విన్నాను. నీకు పెళ్ళయిందటగా?

"ఒక బాబు కూడా" నవ్వుతున్నాడు మదన్.

"భగవాన్ ఎందుకిలా చంపుతున్నాడు మాటలతో! వెర్రిగా నీకోసం పడి చావడంలేదు నీలాగా కాక నేను పెళ్ళి చేసుకొని సుఖంగా వుంటున్నాను' అని తనకి చెప్పడానికి వచ్చాడా? ఆశతో బ్రతుకుతున్న తనని ఇంకా ఆ ఆశతో బ్రతకనివ్వకుండా చేసి పోదామని వచ్చాడా? లేక తన బ్రతుకులో తుపాను రేపడానికా?

"మా బావమరిదికి మీ ఆఫీసులో ఇంటర్వ్యూ కాల్ వచ్చింది. సోమవారం ఇంటర్వ్యూ. మేనేజర్ నీమాట బాగా వింటాడటగా? నీతో చెబితే పనవుతుందని వచ్చాను".

అరుణ తల తిరిగిపోతోంది. చేత్తో తలని గట్టిగా పట్టుకుంది.

"ఏమిటి? అలా వున్నావ్? ఒంట్లో బాగాలేదా? అడిగాడు.

"ఏంలేదు. బాగానే వుంది. కొద్దిగా తల తిరుగుతున్నట్టుగా వుంటేను...."

"సారీ! నిన్ను డిస్టర్బ్ చేసినట్టున్నాను. వస్తాను. సోమవారం కలుస్తాను. నేను చెప్పిన విషయం గుర్తుంచుకుంటావుగా!" అని తలుపు దగ్గరగా వేసి వెళ్ళిపోయాడు మదన్.

ఎంత తెలిగ్గా మాట్లాడుతున్నాడు మదన్? గుడికని చెప్పి, స్నేహితురాలి ఇంటికని చెప్పి మామిడి తోటలోనూ, కోనేటి ఒడ్డునా కలుసుకున్నప్పుడు చేసిన మాటలు, బాసలు అతడు మరిచాడా? తన వాళ్ళని ఒప్పించి తనని చేరుకుంటాననీ, ఎదురు చూడమనీ చెప్పిన మదన్‌కి అసలు తనా మాటలు చెప్పినట్టు కూడా గురుతు లేదా? గాయం మానుతున్న సమయంలో ఎందుకొచ్చి మళ్ళీ గాయం చేశాడు?. ఇంత జరిగినా తనింకా మదన్‌ని పట్టుకుని వేలాడుతోంది ఎందుకు? అతనిలాగే తనూ ఎందుకు మర్చిపోలేకపోతోంది? జీవితాన్ని అంత తేలిగ్గా తీసుకోవడం అందరికీ సాధ్యమా? మనుషులకి కూడా జంతువుల్లాగే ఆలోచించే శక్తి లేకుండా జరిగింది మర్చిపోగలిగితే ఎంత బాగుంటుంది!

** ** ** ** ఆ రాత్రి రెండు

---



## తల్లి పాత్రలు వేయను!

'ఆంటీ సినిమాలో లీడ్‌రోల్ పోషించి ఇంకా తన ఫిగర్ బానే వుందని చాటి చెప్పిన జయసుధ ఇక తాను తల్లి పాత్రలు వేసే ప్రశ్నే లేదంటోంది. హీరోకి తల్లిగానో, హీరోయిన్‌కి తల్లిగానో వేసే పాత్రలు వేయడం తనకేమాత్రం ఇష్టం లేదని చెబుతోంది. పదేళ్ళ క్రితం జగపతిబాబు హీరోగా నటించిన 'సింహస్వప్నం'లో తల్లిగా, ఆ తర్వాత జగపతిబాబే హీరోగా చేసిన 'జైలరు గారి అబ్బాయి'లో సవతి తల్లిగా వేసిన జయసుధకు తల్లి పాత్రలు వేస్తే ఏం కష్టం వచ్చిందో పాపం! అసలు అమ్మ పాత్రలు వేసే దాన్నయితే నేనిప్పుడు ఎంతో బిజీగా వుండేదాన్ని అంది.అక్కటా! అమ్మ పాత్రలంటే అంత అసయ్యం ఎందుకో జయసుధకు.

జాముల వరకూ జాగారం చేసింది అరుణ.

మదన్ పైన, అతను మాట్లాడిన మాటలపైనా అంతులేని అసహ్యం వేసింది. "ఛీ! అతను మనిషి కాదు. పశువు. అతనికోసం తన జీవితాన్ని ఇంతకాలం నాశనం చేసుకున్నందుకు తనని తనే తిట్టుకుంది.

మేనేజర్ ప్రసాద్ ఎప్పుడో అడిగాడు తనని పెళ్ళి చేసుకొమ్మని. ఛ! ఎంతగా ఎదురు చూసింది! ఎంత మోసపోయింది? ఈ వంచకుని గురించా తను ఇన్నాళ్ళూ ఏవేవో వూహించుకుంది? ఈ అర్థంలేని నిరీక్షణలో ఆనందాలకు, ఓపికలకూ దూరమైంది తాను. ప్రేమను నమ్మింది. అది వంచన అని తెలిసినప్పుడు ఒక్కసారిగా తన ఆశా సౌధాలు కూలినట్టయింది. స్వార్థం పరదా కప్పుకున్న ఈ ప్రేమ కోసమా తనింతకాలం తపించింది! మదన్‌ని నమ్మి తను ఇంతకాలం ప్రసాద్‌కి ఏ విషయమూ చెప్పలేదు. ఇంకా నయం. జీవితం నాశనం కాలేదు.

ప్రసాద్ అందగాడే. అయితే అతని భార్య పోయింది. ఇద్దరు పిల్లలున్నారు. అతడు స్వార్థంతోనే పెళ్ళి ప్రతిపాదన చేయలేదు. పిల్లలు ఎలాగూ రెసిడెన్షియల్ స్కూల్లో చదువుతున్నారు. వారిని పెంచి పెద్దచేయవలసిన పసికూనలేమీ కాదు. ఎస్ అనడమా? నో అనడమా అన్న ఛాయిస్‌ను తనకే వదిలివేశాడు ప్రసాద్. దీర్ఘంగా ఆలోచించిన మీదట అరుణ ఒక నిర్ణయానికి వచ్చింది. తనంటే ఎంతగానో ఇష్టపడుతున్న ప్రసాద్‌ని ఎంచుకోవడంలో తప్పు లేదనిపించింది. దృఢ నిశ్చయానికి రావడంతో ఆమెకి ప్రశాంతంగా నిద్రపట్టింది.

** ** ** **

ఆ రోజు ఆఫీసులో అరుణ ఉత్సాహానికి, విష్ చేస్తూ అందర్నీ పలకరిస్తున్న తీరుకు సహోద్యోగులంతా తెగ ఆశ్చర్యపోయారు. ఏమిటీ తేడా? వారికి ఎంతగా ఆలోచించినా అర్థం కాలేదు. ఎప్పుడూ సాదా చీరలో కనిపించే అరుణ ఆరోజు గులాబి రంగు షిఫాన్ చీరలో కనిపించింది. అలంకరణకు ఆమడ దూరంలో వుండే అరుణ చెంపకి ఓ పక్కగా పిన్నుతో గులాబి పెట్టుకుంది. అందమైన ఒక హ్యాండు బ్యాగు ఆమె భుజానికి వేలాడుతోంది. హైహీల్స్‌తో అలవోకగా నడుస్తూ అందర్నీ పలకరిస్తూవుంటే ఏమీ అంతుబట్టలేదు వాళ్ళకి. ఉత్తరం తెచ్చిన మార్పేమో! అని కొందరు పెదవులు కొరుకున్నారు. సాయంత్రం అయిదు గంటలు కాగానే మేనేజర్ ప్రసాద్ తన ఛాంబర్ లోంచి బయటకు వచ్చాడు. ఆయన ఒక్కడే బయటకు వస్తే ఎవ్వరూ పెద్దగా పట్టించుకోరు. కాని జరిగింది వేరు. ఆయన పక్కనే అరుణ కొత్త పెళ్ళి కూతురులా సిగ్గుపడుతూ వయ్యారంగా నడుస్తూ వస్తోంటే మిగతా ఉద్యోగులు నోళ్ళెళ్ళబెట్టి చూస్తుండిపోయారు. వాళ్ళ ఉత్కంఠకు, ఆసక్తికి, కుతూహలానికి ఫుల్‌స్టాప్ పెడుతున్నట్టు అరుణ ఆఫీస్ బోయ్‌వంక చూసింది. ' మీరంతా మీటింగ్ హాల్‌లోకి రండి అరుణమ్మగారు ఒక ముఖ్య విషయం చెబుతారట! పది నిమిషాల్లో అంతా రండి!' అంటూ పెద్దగా చెప్పాడు.

మీటింగ్ హాల్లో కూర్చున్నారన్న మాటే గాని అరుణ ఏమి చెబుతుందో వాళ్ళకు అంతుబట్టడం లేదు. ఆమె చెప్పబోయేదానిమీద అస్పష్టమైన అంచనా ఒకటుంది కాని ఇదమిద్ధంగా తెలియక పోవడంతో వారిలో ఎడతెగని ఉత్కంఠ. బాయ్ పేపర్ ప్లేట్లో లడ్డూ, బూందీ సర్దుతుంటే అరుణ పార్టీ ఎందుకు ఇస్తోందో అర్థంకాక గింజుకుంటున్నారు. బోయ్ నడిగితే అరుణమ్మగారి నోటనే వినండి. వినబోతూ వివరాలెందుకు? అన్నాడు నవ్వుతూ. ఇంతలో అరుణ, ప్రసాద్‌లు రావడంతో కలకలం సద్దుమణిగింది. అరుణ మాట్లాడడానికి గొంతు సవరించుకోవడంతో అంతా నిశ్శబ్దంగా వుండిపోయారు. "ఫ్రెండ్స్ మీకందరికీ ఈ రోజు నా జీవితానికి సంబంధించి ఒక ముఖ్య విషయం చెబుతున్నాను. ప్రసాద్‌గారితో కలసి నేను నా జీవితాన్ని పంచుకోవాలని ఈ రోజు నిర్ణయించుకున్నాను. ఆదివారం ఉదయం పదకొండు గంటలకు మా పెళ్ళి. మధ్యాహ్నం 12 గంటలకు 'హోటల్ కృష్ణా'లో మేమిచ్చే ఆతిథ్యాన్ని కూడా స్వీకరిస్తే మీ ఆశీర్వాదాలు లభించినట్టుగా భావిస్తాము' అని కూర్చోగానే అంతా అభినందన చప్పట్లు కొట్టారు. అరుణను, ప్రసాద్‌ను ఒకరొక్కరుగా వచ్చి అభినందిస్తుంటే వారు కృతజ్ఞతాపూర్వకంగా చేతులు జోడిస్తూ అభివాదం చేస్తున్నారు. అరుణ నిర్ణయం ఆమె జీవితాన్నే కాక ప్రసాద్ జీవితాన్ని మలుపు తిప్పింది.

## కనక దుర్గకి కన్నీళ్ళతో

మైడియర్ మహిషాసుర మర్దినీ!
నువ్వక్కడ క్షేమమేనని మాకు తెలుసు.
మేమిక్కడ క్షేమంగా లేమని చెప్పడానికే ఈ ఉత్తరం
అప్పుడెప్పుడో, కొంతమంది రాక్షసుల్ని చంపేసి
నీకేం! నీవు బాగానే పూజలందుకుంటున్నావ్!
ఇప్పుడు వీధికొక్కడుగా పుట్టుకొచ్చిన
'మామూళ్ళ' రాక్షసుల్ని ఏమీ చేయలేక
మేమే గింజుకు చస్తున్నాం!
ఒక్క శూలంతో అప్పుడెప్పుడో వాళ్ళ జాతి వాళ్ళని
నువ్వు చంపేశావనే సంబరంతో
మేము దసరా చేసుకుంటున్నామని కచ్చతో కాబోలు
ఒక్కొక్కడూ వెయి శూలాల్తో మా మీద దండెత్తుతున్నాడు.
పాత రాక్షసుల్ని చంపినందుకు-
నీకు పూజలే వేయమంటావా?
ఈ కొత్త రాక్షసుల మామూళ్ళ దాహాన్నే తీర్చమంటావా?
మా ఒక్క పలుచని జేబుల్తో
ముందున్న నూతిలో దూకమంటావా?
వెనుకున్న గోతిలో పడమంటావా?
ఏదో ఒకటి తేల్చి చెప్పూ
ఉత్తరం అందగానే జవాబు రాస్తావని ఆశిస్తూ
నీ సమాధానం కోసం ఎదురు చూస్తూ
-సామాన్య మానవుడు.

-పైడికొండల వెంకటేశ్వరరావు.
-జనుపల్లె.(తూ.గో. జిల్లా)